# జగమే మాయ

## కథ

భీమరాజు వెంకటరమణ

"నమస్కారమండీ! నా పేరు వాలేశ్వరరావు. నేనొక సాహితీ పిశాచి..సారీ పిపాసిని. అంతేకాదు నగరంలో కొత్తగా ఆవిర్భవించిన సాహితీ సంస్థ 'హుళక్కి'కి కార్యదర్శిని కూడా. ఇక్కడ 'జగమేమాయ' నవల రచయిత సన్యాసిరావుగార్ని కలుద్దామని వచ్చాను, ముఖ వర్చస్సునుబట్టి చూస్తే మీరేనని నాకు అనిపిస్తున్నది."

సన్యాసిరావుకి తన నవల పేరు ప్రస్థావిస్తూ తన ఇంటికి ఒక వ్యక్తి రావడం, తను ఒక సాహితీ సంస్థ కార్యదర్శి అని చెప్పడంతో ఆనందాశ్చర్యాలు విపరీతంగా ఆవహించి కళ్ళు బయర్లుకమ్మి క్రిందపడబోయాడు. అది ముందుగానే ఊహించిన వాలేశ్వరరావు అతన్ని పట్టుకొని కుర్చీలో కూర్చోబెట్టాడు.

కాసేపటికి కుదుటపడ్డ సన్యాసిరావు "కూర్చోండి! నన్ను వెతుక్కుంటూ వచ్చారంటే నాకు చాలా సంతోషంగా ఉంది. నా నవల మీరు చదివారా?" అడిగాడు ఆతృతగా.

"ఆ నవల నా అదృష్టం కొద్దీ దొరికింది, చదివాను"

"దొరికిందా? ఎక్కడ?"

"చెత్తకుండీ...ప్రక్కన.."

"అవునా?"

సన్యాసిరావు ముఖకవళికలు గమనించిన వాలేశ్వరరావు "అంటే ఒకటై ఉంటుందండీ! ఆ నవలని ప్రక్కనే ఉన్న అపార్టుమెంటు బాల్కనీలో కూర్చొని ఎవరో చదువుతూ అక్కడ పెట్టి ఏదో పనిమీద వెళ్ళి ఉండొచ్చు. తరువాత మర్చిపోయి ఉండొచ్చు. అది గాలికి క్రిందపడి ఉండొచ్చు" అన్నాడు.

మాడిపోయిన సన్యాసిరావు ముఖం కాస్త తేరుకుంది. ఇక అతన్ని విషయంలోకి లాక్కొచ్చాడు వాలేశ్వరరావు.

"అసలు ఈ విషయం చెప్పండి! జగమేమాయ నవలలో సారాంశం ఏమిటి? వందలకొద్దీ నవలలు చదివిన నాకే అర్థం కాలేదు?" కుతూహలంగా అడిగాడు.

సన్యాసిరావు ఉబ్బితబ్బిబ్బైపోయాడు. "ఏమేవ్! రెండు కాఫీలు పట్రా!" అని భార్య వినేట్లు చెప్పి "నా నవల మనిషి నడవడి మీద చురకలేస్తూ వ్రాసింది. కీర్తి, కాంత, కనకంకోసం కొట్టుకు చావకండి, అవి పోయేప్పుడు మీ వెంటరావు" అని చెప్పడం దాని సారాంశం.

"ఆహా! ఈ జూబ్లీహిల్స్‌లో విలాసవంతమైన జీవితం గడుపుతూ అలాంటి నవల మీరు వ్రాసారంటే హాట్సాఫ్ టు యూ సార్!"

"ఏమేవ్! ఏసి ఆన్ చెయ్యి"

"అయితే సన్యాసిరావుగారూ! నీ నవల గతంలో ఏ పత్రికలోనైనా సీరియల్‌గా ప్రచురణ జరిగిందా?"

సన్యాసిరావు ఆ ప్రశ్నకు చిరాకుపడుతూ "అసలు నవలలు సరిగా చదవటం చేతనైన ఎడిటర్లు ఏరండీ ఈ సిటీలో? నా నవలని అర్థం చేసుకోలేక తిరస్కరించారు. నేనే ఒక పత్రికపెట్టి నా నవలను సీరియల్‌గా వేద్దామన్నంత కోపం వచ్చింది. కానీ కుదరక వదిలేసాను" అన్నాడు ముఖం చిట్లిస్తూ.

"మంచిపని చేసారు! కాళిదాసంతటివాడే రసజ్ఞత లేనివాళ్ళముందు కవిత్వం చెప్పటం దౌర్భాగ్యం అన్నాడుట, ఇక మనమెంత సార్!"

అంతటి మహానుభావుడితో పోల్చేసరికి ఉక్కిరిబిక్కిరయ్యాడు సన్యాసిరావు.

సాహితీ చర్చ ఊపందుకుంది. "ఏమేవ్! మరో రెండు కప్పులు కాఫీ!"

"అన్నట్లు ఈ నవల ఎవరు ఆవిష్కరించారు? సభ ఎక్కడ నిర్వహించారు? ఎంతమంది హాజరైనారు?"

ఈ ప్రశ్నల వర్షానికి సన్యాసిరావు ముఖం కందగడ్డలా మారిపోయింది.

విషయాన్ని పసిగట్టిన వాలేశ్వరరావు "ఫరవాలేదు చెప్పండి! ఈ విషయం మనిద్దరిమధ్యే ఉంటుంది!"

సన్యాసిరావు ముఖం మామూలు రంగులోకి వచ్చేసింది. "మా కాలనీ కమ్యూనిటీ హాల్లోనే ఏర్పాటు చేసాను. మా ఇంటి చుట్టుప్రక్కల వాళ్ళను బ్రతిమాలగా ఆరుగురు వచ్చారు. స్టేజీమీద కూర్చోవడానికి, ఎదురుగా మరో ఆరుగురొచ్చి కూర్చున్నారు. పుస్తకాన్ని నేనే ఆవిష్కరించి, దాని గురించి మాట్లాడి, హాజరైన వారందరికీ పుస్తకాలు ఇచ్చాను. అందరూ తీసుకున్నారు. కానీ ఆ రోజు మైకు ఏర్పాటు చేసిన కుర్రాడు మాత్రం పుస్తకాన్ని తీసుకోకపోగా నాతో అర్థంలేని వాదన చేసాడు" అన్నాడు కాస్త దిగులు ముఖం పెట్టి.

"ఏంటట అతగాడి బాధ?"

"తను ఎన్నో మీటింగులకి మైకులు ఏర్పాటు చేసాడుట, కానీ మా మీటింగులో మాత్రం నవల గురించి నేను చెప్పినదానికి వాస్తవానికీ సంబంధం లేదుట. "కీర్తి కోసం ఆరాటపడొద్దంటున్నారు. ఇప్పుడు మీరు చేస్తున్నదేమిటి?, కాంతలు కోసం మోహం తగదు ముసలితనంలో ముడతలు పడ్డ శరీరం చూసి బుద్ధితెచ్చుకోండి అని హితవు పలికారు. ముసలి కాంతలు గురించి ఎవ్వరైనా ఆరాటపడతారా? అయినా యాభై ఏళ్ళు అన్నీ అనుభవించి ఇప్పుడు కాంతలు గురించి మాబోటివాళ్ళకు చెబుతారా? ఇక కనకం శాశ్వతం కాదు పోయేప్పుడు మనతో రాదు అంటున్నారు, మిమ్మల్ని, మీ చేతి ఉంగరాలని, మెళ్ళో బంగారు గొలుసులని చూస్తే అర్థమౌతుంది దానివెంట మీరు ఎంతగాపడ్డారో! ఆ కనకంతోనే కదా మీ ఈ పుస్తకం ప్రింటింగు, ఈ మీటింగ్, నా మైకు? అయితే నవల పేరు మాత్రం జగమే మాయ అని కరెక్టుగా పెట్టారు!" అంటూ నవ్వుతూ వెళ్ళిపోయాడు. నా నవల నచ్చని వాడికి దాని పేరు ఎలా నచ్చిందో నాకిప్పటికీ అర్థం కావడం లేదు" అన్నాడు వాలేశ్వరరావు తలగోక్కుంటూ.


"మీ నవల మిమ్మల్ని కలిసిందాకా నాకే అర్థం కాలేదు. ఆ కుర్రకుంక ఎంత? అవార్డు పొందే నవల్లు అంతే ఉంటాయిసార్!" అన్నాడు వాలేశ్వరరావు టీపాయ్ మీద ఉన్న కాఫీ కప్పు అందుకుంటూ.

"అవార్డా? మీరు చెప్పేది నిజమా?" మళ్ళీ అటెన్షన్‌లోకి వచ్చేసాడు సన్యాసిరావు.

"అక్షరాలా నిజం! కాకపోతే ప్రతిదానికి ప్రచారం కావాలి. మా 'హుళక్కి' సంస్థ తరఫున మీకొక సన్మానం, బిరుదు ప్రదానం చేసామంటే రాష్ట్రమంతా మీకీర్తి దావానలంలా వ్యాపిస్తుంది. ఆ దెబ్బతో మన ప్రభుత్వం మిమ్మల్ని గుర్తించి అవార్డు ప్రకటిస్తుంది. తరువాత కేంద్రప్రభుత్వంచే జాతీయ స్థాయిలో సత్కారం, తరువాత అంతర్జాతీయంగా పురస్కారం! చెప్పలేం! ఏ రోజు ఏమి జరుగుతుందో! కానీ మీరు కాస్త ఖర్చుపెట్టుకోవాల్సి వస్తుంది"

"ఏమేవ్! సార్ ఇవాళ ఇక్కడే భోం చేస్తారు! ఏర్పాట్లు చూడు. అయితే వాలేశ్వరరావుగారు ఖర్చంటే సుమారు ఎంతవుతుంది?" అడిగాడు కాస్త ముందుకు వంగి.

కాఫీ కప్పులు తీసుకెళ్ళడానికి సన్యాసిరావు భార్య అక్కడికి రావడంతో ఆమెకు అర్థం కాకూడదని వాలేశ్వరరావు విషయాన్ని మరోవిధంగా చెబుతూ "పంచపాండవులను ఏర్పాటు చెయ్యండి చాలు" అన్నాడు. అందుకు సన్యాసిరావు సంతోషంగా అంగీ




కరించి లోపలికెళ్ళి ఐదు వేల రూపాయలు తెచ్చి ఇచ్చాడు.

"ఇదేమిటి? ఐదువేలు ఇచ్చారు?" ఆశ్చర్యంగా అడిగాడు వాలేశ్వరరావు.

"పంచపాండవులన్నారుగా" తనూ అదే ఆశ్చర్యం ప్రకటిస్తూ అన్నాడు సన్యాసిరావు.

"పంచపాండవులంటే యాభైవేలు"

"అమ్మో! అంతా? పంచపాండవులంటే అయిదుగురేగా? యాభైమంది కాదుగా?"

"భలేవారే! యుగాలు మారిపోలా? గణితం కూడా మారిపోదా?"

"అంత నా వల్ల

కాదు. శివకేశవులైతే ప్రయత్నం చేస్తా"

"త్రిమూర్తులు, చతుర్వేదాలు కూడా లాభం లేదు"

సన్యాసిరావుభార్య అక్కడనుండి వెళ్ళిపోయింది.

"సన్యాసిరావుగారూ! నాకు ఒక్కరూపాయి కూడా వద్దు. మీలాంటి సాహితీమూర్తులకు సేవ చేసుకోవడంలో కలిగే తృప్తి చాలు. మీకు తగిన గుర్తింపు మా సంస్థ ద్వారా తీసుకురావడమే నా ధ్యేయం. కాకపోతే అంత డబ్బు ఖర్చు చేసే స్థోమత నాకు లేదు కాబట్టే మీకు శ్రమ ఇస్తున్నాను. అసలు మా ఏర్పాట్లు ఎలా ఉంటాయో విని ఆ తరువాత మీరే నిర్ణయించుకోండి. అక్కడ ఇక్కడ కాదు రవీంద్ర భారతిలో కార్యక్రమం. సిటీలోని ప్రతి చౌరస్తాలో మీ నిలువెత్తు సైజు ఫోటోలతో ఫ్లెక్సీ బోర్డులు, లోకల్ టీవీ ఛానల్‌లో నగర ప్రజలకు ఆహ్వానం. మిమ్మల్ని ఇంటినుండి తీసుకురావడానికి మీ కారుకు ముందు రెండు మూడు ఎస్కార్టు కార్లు, మీరు ఆడిటోరియంలో అడుగుపెట్టగానే కరతాళధ్వనులు చెయ్యటానికి లాల్చీ పైజమా ధరించి సాహితీ ప్రియుల రూపంలో ఓ వందమంది ఏర్పాటు, అంతేకాదు! స్టేజీమీదకు మీరు మామూలుగా మెట్లెక్కి రారు. మీకోసం ప్రత్యేకంగా పైనుంచి స్టేజీమీదకు మెట్లు ఏర్పాటు. అంటే అందరూ లేచి ఆహ్వాన సూచికంగా చప్పట్లు కొడుతుండగా చేయి ఊపుతూ మెట్లు దిగి స్టేజీమీదకు వస్తారన్నమాట! ఇలా చెప్పుకుంటూ పోతే ఈ రోజు చాలదు"

సన్యాసిరావు మెట్లు దిగుతూ చేయి ఊపుతూ స్టేజీమీదకు వస్తున్నట్లు అప్పుడే ఊహల్లో తేలిపోతున్నాడు. భుజం మీద తట్టి ఈ లోకంలోకి తీసుకొచ్చాడు వాలేశ్వరరావు. వెంటనే డీల్ కుదిరింది.

* * *

అనుకున్న రోజు సాయంత్రం అయింది. వాలేశ్వరరావు పంపుతానన్న రెండు ఎస్కార్ట్ కార్లు రాలేదు. అతని సెల్‌ఫోన్ ఆఫ్ చేసి ఉంది. సన్యాసిరావుకి కంగారు ఎక్కువైయింది. ఆ సంస్థ అడ్రసు ఎక్కడో వాలేశ్వరరావు సరిగా చెప్పలేదు. తనూ వివరంగా అడిగి తెలుసుకోలేదు. "ప్రొద్దుట కూడా ఫోన్‌లో మాట్లాడాడు కదా? ఒకవేళ రవీంద్రభారతి దగ్గరకు వచ్చేసి ఉంటాడా?" సన్యాసిరావు ఆలోచనలు రకరకాలుగా పోతున్నాయి. ఇక ఆలస్యం చేసే సహనం లేదు. వెంటనే కారులో రవీంద్రభారతికి బయలుదేరాడు.

రవీంద్రభారతికి చేరి అక్కడ పరిస్థితి చూసి నోరు తెరిచాడు సన్యాసిరావు. అక్కడ ఎవరూ లేరు. 'ఏమై ఉంటుంది? జనం రాలేదేమిటి? ఇలాంటి కార్యక్రమాలకి కాస్త ఆలస్యంగా వస్తుంటారు కదా! కాసేపు వేచి చూస్తే?' అనుకుంటూ అయినా ఎందుకైనా మంచిదని ఆఫీసులోకెళ్ళి వాకబు చేసాడు. ఆ రోజుకి ఏ కార్యక్రమాలకి ఆడిటోరియం ఎవరూ తీసుకోలేదని తెలుసుకొని సన్యాసిరావు బిక్కచచ్చిపోయి అక్కడే బయట మెట్లమీద కూర్చుండిపోయాడు.

కాసేపటికి ఒక కుర్రవాడు మోటర్ బైక్ మీద వచ్చి "సన్యాసిరావుగారంటే మీరేనా" అని అడిగి ఒక ఉత్తరం చేతికిచ్చి వెళ్ళిపోయాడు.

ఆత్రుతగా ఆ ఉత్తరం చదవసాగాడు "ప్రియమైన సన్యాసిరావుగారూ! నమస్కారములు. ఏ రచయిత అయినా కవి అయినా ఆశించేది ఒక్కటే! తన రచనల వలన సమాజంలో మంచి మార్పు రావాలని. అది కొంతమందిలో వచ్చినా కనీసం ఒక్కరిలో వచ్చినా ఆ రచయిత విజయం సాధించినట్లే! ఆ విజయం ఈరోజు మిమ్మల్ని వరించింది. మీ నవల నాలో పెనుమార్పు తెచ్చింది. డబ్బుకోసం పేరుకోసం ఇన్నాళ్ళు తాపత్రయపడ్డాను. కానీ మీ నవల నన్ను ఆలోచింపజేసింది. అంతులేని వైరాగ్యంలో ముంచేసింది. మరో విచిత్రం చూసారా! మీ నవల పేరు నా సంస్థపేరు ఒకే సందేశాన్ని ప్రకటిస్తున్నాయి. అంతా మాయేనని. ఈ సభలు సమావేశాల మీద విరక్తి పుట్టింది. మీ సభనుంచే నాలోని మార్పు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతానికి నా సంస్థని కూడా మూసేశాను. ఇక ఏ కార్యక్రమాల జోలికీ పోదలుచుకోలేదు. కనీసం మీరిచ్చిన యాభైవేలూ అయిపోయేదాకా... నమస్కారములతో...వాలేశ్వరరావు."



# లక్కీ ప్రియాంక

**బాలీవుడ్ సైలెంట్‌గా వుంటూనే తనదైన సక్సెస్ సాధిస్తున్న హీరోయిన్ ఎవరయ్యా అంటే- ప్రియాంకా చోప్రా అని ఠక్కున చెబుతున్నారు సినీ పండితులు. ఇప్పుడామె సినిమాకి ఏకంగా 6 కోట్లు డిమాండ్ చేస్తోందిట. అంత ఇవ్వడానికి నిర్మాతలు సైతం ఉత్సాహం కనబరుస్తుండడం కూడా అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. అయితే ప్రియాంక వుంటే ఆ సినిమాకి మంచి ఓపెనింగ్స్ వుంటాయని ఇటీవల కొన్ని చిత్రాలు నిరూపించడంతో ఆమె క్రేజ్ అలా అలా పెరుగుతోందిట.**